సాక్షి చిత్తూరు

ఆదివారం । 20 । ఆగస్టు । 2023



జాతీయ రహదారిపై కారు దగ్ధం

శ్రీరంగరాజపురం మండలం లక్ష్మీపురం వద్ద రహదారిపై కారు దగ్ధమైంది. అకస్మాత్తుగా కారులో మంటలు రేగాయి. - 8లో



అభ్యసనా సామర్థ్యాలు పెంచాలి

చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించాలని డీఈఓ విజయేంద్రరావు తెలిపారు - 8లో

	గరిష్ఠం	కనిష్ఠం
చిత్తూరు	37	25
తిరుపతి	37	25
తిరుమల	33	22
గూడూరు	38	27
నగరి	38	26

న్యూస్‌రీల్

హంద్రీ-నీవాపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న జేసీ శ్రీనివాస్

గుడుపల్లె: హంద్రీ–నీవా కాలువ పనులపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ ఆదేశించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో హంద్రీ-నీవా నిర్వాసిత రైతులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. కాలువ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, పెండింగ్‌లో ఉన్న భూములను సేకరించి రైతులకు అందించాల్సిన పరిహారానికి సంబంధించి నివేదికను వెంటనే పంపాలని అధికారులను ఆదేశించారు. కాలువ నిర్మాణానికి సంబంధించి ఎక్కడా భూములు పెండింగ్ లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందన్నారు. రైతులు ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదని, త్వరితగతిన పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. తహసీల్దార్ గుర్రప్ప, అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా కంటి వెలుగు



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్: వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి తెలిపారు. శనివారం కార్యాలయంలో శనివారం ఆమె కంటి వెలుగు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. కంటి వెలుగుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. సమస్యలున్న వృద్ధులు, పిల్లలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని తెలిపారు. అలాగే విద్యాసంస్థలు, గ్రామాల్లో కంటి సమస్యలకు కారణాలు, నివారణ అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. కంటి వెలుగు మేనేజర్ మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ సమావేశాలకు ఆహ్వానం



అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ

పుంగనూరు: శ్రీనగర్‌లో గుడ్ గవర్నెన్స్‌పై జరుగనున్న జాతీయ స్థాయి సమావేశాలకు విద్యావంతుడైన పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈమేరకు శనివారం సాయంత్రం పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ స్థాయి సమావేశాలు ఈనెల 21 నుంచి 23 వరకు జరుగనున్నాయి. మన రాష్ట్రం నుంచి ఎంపికైన ఏడుగురు ప్రతినిధుల బృందంలో భాస్కర్‌రెడ్డి కూడా ఉన్నారు. ఈ బృందం ఆదివారం బెంగళూరు నుంచి జమ్ముకాశ్మీర్‌కు వెళ్లనుంది. అన్ని రాష్ట్రాలకు చెందిన బృందాలు గుడ్ గవర్నెన్స్‌తో పాటు పంచాయతీరాజ్ పాలన అంశాలపై చర్చించనున్నాయి.

పంటలను కాపాడేందుకు రక్షక తడులు

చిత్తూరు అగ్రికల్చర్: సాగు నీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా పరికరాలు పంపిణీ చేసి రక్షక తడులు అందించనున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నీటి ఎద్దడి నుంచి వేరుశనగ పంటను కాపాడేందుకు రక్షక తడులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో రెయిన్ గన్లు, స్ప్రింకర్లు, పైపులు, ఆయిల్ ఇంజన్లను రైతులు పొందవచ్చని తెలిపారు. పనులు పూర్తయిన వెంటనే పరికరాలను మళ్లీ రైతు భరోసా కేంద్రాలకు చేర్చాలని పేర్కొన్నారు. రవాణా, మరమ్మతు ఖర్చులను రైతులే భరించాలని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈసదుపాయాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సంక్షేమ విజయం!

'పేదల అభ్యున్నతే లక్ష్యం.. కులమతాలు, పార్టీలు చూడం' అంటూ క్షేత్రస్థాయిలో ప్రజల ముంగిటకే చేరుతున్న సంక్షేమ పథకాలకు మరోసారి గ్రామీణులు జైకొట్టారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అధికార పార్టీ అభిమానులకు బాసటగా నిలిచారు. శనివారం జరిగిన సర్పంచ్ ఉపఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను భారీ మెజారిటీతో గెలిపించారు. తిరుపతి జిల్లాలో జరిగిన ఏకైక సర్పంచ్ స్థానాన్ని సంక్షేమ సారథి, సీఎం జగనన్నకు బహుమతిగా ఇచ్చారు. వార్డు సభ్యులు సైతం సగర్వంగా తలెత్తుకునేలా భారీ మెజారిటీని అందించారు. ఊహకందని రీతిలో టీడీపీ మద్దతుదారులను మట్టికరిపించారు. కుట్రలు, కుతంత్రాలు, డబ్బు, మద్యానికి లొంగమని చాటిచెప్పారు. ఈ క్రమంలో టపాసులు కాల్చుతూ.. మిఠాయిలు పంచుతూ విజయోత్సాహంతో వైఎస్సార్‌సీపీ అభిమానులు సందడి చేశారు.

- సర్పంచ్ ఉపఎన్నికల్లో అధికారపార్టీ మద్దతుదారుల హవా
- ఘోర ఓటమిపాలైన టీడీపీ మద్దతుదారులు
- చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వైఎస్సార్‌సీపీ ఫ్యాన్స్ విజయోత్సవాలు



శాంతిపురంలో వైఎస్సార్‌సీపీ అభిమానుల విజయోత్సవ ర్యాలీ



అడవికొడియంబేడు సర్పంచ్ కిరణ్‌కుమార్ విజయంతో అభిమానుల ఉత్సాహం

సాక్షి, తిరుపతి: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో శనివారం జరిగిన సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయఢంకా మోగించారు. అనుకోని కారణాలతో ఎన్నికలు అనివార్యమైనా ప్రతిపక్ష పార్టీ నేతల మద్దతుతో బరిలో నిలిచిన ఆ పార్టీ మద్దతుదారులకు ఘోర ఓటమి తప్పలేదు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఇల్లు నిర్మించుకుంటున్న శాంతిపురం మండలంలోని పదో వార్డులో సైతం వైఎస్సార్‌సీపీ మద్దతుదారు విజయకేతనం ఎగురవేశారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన సుధాకర్ వార్డు మెంబర్‌గా 47 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. వరుస ఓటములతో ఇదేం ఖర్మరా బాబూ అంటూ తెలుగు తమ్ముళ్లు లోలోపలే కుమిలిపోతున్నారు.

తిరుపతి జిల్లాలో..

తిరుపతి జిల్లాలో మొత్తం 5 సర్పంచ్, 41 వార్డు స్థానాలకు ఉప ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 7న జారీఅయ్యింది. ఇందులో 4 సర్పంచ్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవమయ్యారు. 41 వార్డు స్థానాలకుగాను 34 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవమయ్యారు. శనివారం ఒక సర్పంచ్, 7 వార్డు మెంబర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహించగా.. అందులో పిచ్చాటూరు మండలం, అడవికొడియంబేడు సర్పంచ్ స్థానాన్ని వైఎస్సార్‌సీపీ మద్దతుదారు కిరణ్‌కుమార్ కైవశం చేసుకున్నారు. ఇక జిల్లా వ్యాప్తంగా ఏడు వార్డులకు జరిగిన ఎన్నికల్లో ఆరు వార్డుల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయకేతనం ఎగురవేయగా.. ఒక వార్డులో టీడీపీ మద్దతుదారు గెలుపొందారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సర్పంచ్ ఉప ఎన్నికల సమాచారం

సర్పంచ్ స్థానాలు	ఏకగ్రీవం	ఎన్నికలు	విజయం
08	07	01	వైఎస్సార్‌సీపీ మద్దతుదారు విజయం

చిత్తూరు జిల్లాలో..

చిత్తూరు జిల్లాలో మొత్తం 3 సర్పంచ్, 46 వార్డు స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో 3 సర్పంచ్ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ మద్దతుదారులే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 46 వార్డు స్థానాలకుగాను 37 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంకాగా.. 2 వార్డులకు నామినేషన్లు దాఖలు కాలేదు. మిగిలిన 7 వార్డులకు ఎన్నికలు నిర్వహించగా.. ముగ్గురు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, నలుగురు టీడీపీ మద్దతుదారులు గెలుపొందారు.

తిరుపతి జిల్లా మొత్తం 41 వార్డులు

ఎన్నికలు జరిగినవి - 40
ఎన్నికలు జరగనివి - 01
వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు - 38
టీడీపీ మద్దతుదారులు - 2

చిత్తూరు జిల్లాలో వార్డులు 46

ఎన్నికలు జరిగినవి 44
వైఎస్సార్‌సీపీ మద్దతు - 39
టీడీపీ మద్దతు - 5

పకడ్బందీగా ఎన్నికలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో శనివారం జరిగిన సర్పంచ్ ఉప ఎన్నికలకు పోలీసులు భారీ భద్రత ఏర్పాటు చేశారు. ఎన్నికలు జరిగిన ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ బందోబస్తును సమకూర్చారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు నిత్యం పర్యవేక్షణ చేశారు. కౌంటింగ్ ప్రక్రియ అనంతరం గెలుపొందిన అభ్యర్థుల వివరాలను ప్రకటించారు.

ఆదిలోనే ఓటమి రుచిచూపించారు

చంద్రబాబు రాజకీయాల్లోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు జరిగిన ఎన్నికల్లో ఘోర పరాభవం తప్పడం లేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి నాయకత్వానికి పట్టం కడితే.. నేడు ఆయన తనయుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి జై కొడుతున్నారు. అటు సార్వత్రిక ఎన్నికలు.. ఇటు స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్, వైఎస్ జగన్ ప్రభంజనం కొనసాగుతోంది. తాజాగా జరిగిన సర్పంచ్, వార్డు ఉప ఎన్నికల్లోనూ చంద్రబాబుకు ఘోర పరాభావం తప్పలేదు. కుప్పం నియోజక వర్గం, శాంతిపురం మండలం, ఏడవ మైలు వద్ద సొంత ఇల్లు నిర్మించుకుంటున్న 10 వార్డులో టీడీపీ బలపరిచిన అభ్యర్థికి ఓటమి తప్పలేదు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన సుధాకర్‌కే స్థానికులు ఓట్లేసి గెలిపించడం విశేషం. 2019 సాధారణ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ స్థానాలకు గాను టీడీపీ గెలుచుకుంది కేవలం ఒకే స్థానం. అది కూడా చంద్రబాబు ప్రాతినిథ్యం వహించిన కుప్పం. మిగిలిన 13 అసెంబ్లీ, చిత్తూరు, తిరుపతి, రాజంపేట పార్లమెంట్ స్థానాలు సైతం వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు కైవశం చేసుకున్న విషయం తెల్సిందే.

స్థానిక ఎన్నికల్లోనూ ఘోర పరాభవం

ఉమ్మడి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ ప్రభంజనం కొనసాగింది. కార్పొరేషన్, మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచ్ స్థానాల్లోనూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు పట్టం కట్టారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు జెడ్పీటీసీ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ విజయం సాధించింది. 68 ఎంపీటీసీ స్థానాల్లో 65 వైఎస్సార్‌సీపీ అభ్యర్థులే గెలుపొందారు. 94 సర్పంచ్ స్థానాల్లో 83 వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులే విజయం సాధించారు. ఆ తరువాత జరిగిన కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో 19 వార్డుల్లో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లే గెలుపొందారు. టీడీపీ కేవలం 6 కౌన్సిలర్లకే పరిమితమైంది.

విజయోత్సాహం

వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయోత్సాహంతో ర్యాలీలు నిర్వహించారు. గెలుపొందిన అభ్యర్థులను పూలమాలలతో గ్రామీణులు సత్కరించారు. అభ్యర్థులను భుజాల మీద మోసుకుంటూ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. మిఠాయిలు పంచిపెట్టారు.

కుప్పంలో పెరిగిన వైఎస్సార్ సీపీ బలం

- వార్డు ఎన్నికల ఫలితాలే నిదర్శనం
- ఆరు వార్డుల్లో ఐదు వైఎస్సార్ సీపీ
- ప్రభుత్వ పనితీరుకు ప్రజల మద్దతు
  – ఎమ్మెల్సీ భరత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

కుప్పం: నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీ బలం బాగా పెరిగిందని, ప్రస్తుతం వెలువడిన వార్డు ఎన్నికల ఫలితాలు ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. శనివారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వార్డు స్థాయిలో జరిగిన ఎన్నికలు వ్యక్తుల మంచితనం, ప్రభుత్వ పాలనపై ఆధారపడి ఉంటుందని అన్నారు. నియోజకవర్గంలో ఆరు వార్డులకు జరిగిన ఎన్నికల్లో ఐదింట వైఎస్సార్ సీపీ మద్దతుదారులు విజయం సాధించారని తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న మంచిని గుర్తించి తమ పార్టీ మద్దతుదారులను ప్రజలు ఆదరించారని అన్నారు. ఈ ఎన్నికల్లో గెలుపొందేందుకు టీడీపీ సైకిల్ ర్యాలీలు, ఇంటింటా ప్రచారాలు, జిమ్మిక్కులు చేసినా ప్రజలు మోసపోకుండా వైఎస్సార్ సీపీ వైపే నిలిచారని తెలిపారు.

టీడీపీకి చెంపపెట్టు

ఎన్నికల్లో గెలుపోటములపై ఊర్లు వదిలిపోవాలని సవాల్ విసిరిన టీడీపీ నాయకులకు ఈ ఫలితాలు చెంపపెట్టని భరత్ అన్నారు. శాంతిపురం మండలం, కడపల్లె పంచాయతీలో స్వయాన చంద్రబాబు ఇంటి నిర్మాణం జరిగే వార్డులో సైతం వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి గెలుపొందారని చెప్పారు. ఈ ఎన్నికల ప్రచారాల్లో ఎక్కడా వైఎస్సార్ సీపీ ఆర్భాటాలు సృష్టించలేదని, స్వచ్ఛందంగా ప్రజలే వైఎస్సార్ సీపీని ఆదరించారని తెలిపారు.

గజ బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

– మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పలమనేరు: పెద్దపంజాణి మండలం ముదిరెడ్డిపల్లి వద్ద శనివారం ఏనుగు దాడిలో మృతి చెందిన మార్కొండయ్య కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్ని విధాల ఆదుకుంటామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ రెడ్డెప్ప శనివారం తెలిపారు. వారు 'సాక్షి'తో మాట్లాడుతూ ఇప్పటికే డీఎఫ్‌ఓ చైతన్య కుమార్‌రెడ్డితో మాట్లాడామని పేర్కొన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పాలని సూచించినట్లు తెలిపారు. బాధిత కుటుంబానికి సంతాపాన్ని తెలిపారు.

మహిళా ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మెప్మా అర్బన్ మార్ట్ ప్రారంభిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్‌కే రోజా తెలిపారు. చేశారు. శనివారం పుత్తూరు పంచాయతీరాజ్ అతిథిగృహం ఆవరణలో ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ స్టాళ్లను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న పాలనలో మెప్మా అర్బన్ మార్కెట్ల ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారని తెలిపారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు స్వయం సహాయక సంఘాల రుణాలను మాఫీ చేస్తానని అధికారంలోకి వచ్చారని, ఆ తరువాత మోసం చేశారని గుర్తు చేశారు. పాదయాత్రలో ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వంలోకి వచ్చిన అనంతరం అసలు వడ్డీతో సహా నాలుగు విడతలుగా సీఎం జగనన్న రుణాలను మాఫీ చేశారని తెలిపారు. డ్వాక్రా సంఘాలకు ఎస్‌హెచ్‌ఈ బ్యాంకు లింకేజీ కింద ఒక్కో గ్రూపునకు రూ.20 లక్షల సాయం అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్న తోడు కింద ఒక్కొక్కరికి రూ.10 వేలు ఇవ్వగా, ప్రస్తుతం రూ.13 వేలు ఇస్తున్నట్లు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి, మెప్మా సిటీ మేనేజర్ ప్రమీల, ఆర్‌పీ సుజాత, మున్సిపల్ చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాహీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంతకీ..ఆ తల్లి ఎవరుపై విచారణ

- సీసీ ఫుటేజీల పరిశీలన
- 20ఏళ్ల యువతి బిడ్డను ప్రసవించి పరారీ అయినట్లు నిర్ధారణ

సాక్షి ఎఫెక్ట్..

చిత్తూరు రూరల్: మూడు రోజులకు కిందట చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రి బాత్‌రూంలో ఆడబిడ్డకు జన్మనిచ్చి పరారైన ఘటనపై 'సాక్షి' ప్రచురితమవుతున్న వరు స కథనాలపై జిల్లా కలెక్టర్ షణ్మోహన్ స్పందించారు. విచా రణ బాధ్యతలను డీఐఓ రవిరాజుకు అప్పగించారు. ఈ మేరకు ఆయన శనివారం జిల్లా ఆస్పత్రిలో విచారణ ప్రారంభించారు. సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, ఆర్‌ఎంఓ సంధ్య సమక్షంలో అత్యవసర విభాగంలోని డాక్టర్లు, సిబ్బందిని ఆయన ప్రశ్నల పరంపరతో లోతుగా విచారించారు. మధ్యాహ్నం 1.15 గంటలకు ప్రారంభమైన విచారణ మూడు గంటలు సాగింది. వారి ఇచ్చిన సమాచారం మేరకు సీసీ ఫుటేజీలను పరిశీలించగా... గర్భిణి ఇద్దరు సహాయకులతో వేకువజామున 3.40 గంటలకు అత్యవసర విభాగాన్ని ఆశ్రయించింది. తర్వాత ప్రసూతి విభాగానికి వెళ్లింది. మళ్లీ 4.50 అత్యవసర విభాగానికి వచ్చింది. పురిటినొప్పులు అధికం కావడంతో సహాయకులతో బాత్‌రూంలోకి ప్రవేశించింది. 5.05గంటలకు బయటకు అందరూ బయటకు వచ్చేశారు. 5.10గంటలకు బొలేరా వాహనంలో తల్లీ, ఆ ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. 5.10 గంటలకు అటువైపుగా వెళ్లిన స్వీపర్ పసికందు ఏడుపు, కొళాయిలో నీరు వస్తున్న శబ్దం విని బాత్‌రూమ్‌లోకి వెళ్లి చూసింది. పసికందును వదిలి వెళ్లారని కేకలు పెట్టింది. దీంతో బిడ్డను ఎస్ఎన్‌సీయూ తీసుకెళ్లారని విచారణలో గుర్తించినట్లు తెలిసింది. పూర్తి వివరాలతో కలెక్టర్ నివేదికలు సమర్పిస్తామని విచారణ అధికారి రవిరాజు పేర్కొన్నారు. కాగా సీసీ ఫుటేజీ ఆధారంగా ఆ తల్లీకి 19–20 ఏళ్లు ఉండవచ్చని భావిస్తున్నారు. అలాగే సహాకులుగా వచ్చిన వ్యక్తి వయస్సు 25, మహిళ వయస్సు 35 ఉంటుందని అధికారులు గుర్తించారు.

సీఎం రాక కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు


మాట్లాడుతున్న మంత్రి రోజా

నగరి : సీఎం రాకకోసం ప్రజలు ఆతృతగా ఎదురుచూస్తున్నారని మంత్రి ఆర్కేరోజా అన్నారు. శనివారం రాత్రి ఆమె మీడియాతో మాట్లాడారు. విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టిన జగనన్న ఈనెల 28న జగనన్న విద్యా దీవెన కార్యక్రమం లాంఛనంగా ప్రారంభించేందుకు నగరికి వస్తున్నారన్నారు. జగనన్న రాకను అందరూ ఆత్మీయంగా స్వాగతిస్తున్నారని తెలిపారు. పేద పిల్లలు ఉన్నత చదువులు చదువుకోవాలని పరితపిస్తున్న ఏకైక సీఎం జగనన్న అన్నారు. చంద్రబాబు నాయుడు పిచ్చి పరాకాష్టకు చేరిందన్నారు. 45 రోజులు రాఖీ పూజ గదిలో పెట్టండి, చేతికి కట్టుకోండి అంటూ వింతగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. 14 ఏళ్ల సీఎం రాష్ట్రానికి ఆయన చేసింది ఏమి లేదని ఆరోపించారు. ప్రస్తుత పాలనలో ప్రజా సంక్షేమం చూసి తట్టుకోలేక పోతున్నారని పేర్కొన్నారు జగనన్నకు వస్తున్న ప్రజాదరణ చూసి చంద్రబాబు, పవన్ కల్యాణ్‌కు పూనకాలు వస్తున్నాయని ఆరోపించారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం:: తిరుపతి - 517502

పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ ప్రకటన

పర్యావరణము మరియు అడవులు, కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ ప్రకటన జారీ నెం.ఎస్.ఓ.1533, తేది: 14.09.2006 ననుసరించి **శ్రీ పి.క్షీరసాగర రెడ్డి వారిచే** సర్వేనెం.260/5 పార్టు (పాత సర్వే నెం.12), కాకవేడు(V), నగరి(M), చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ పరిధిలో ప్రతిపాదించబడిన రోడ్డు మెటల్ & బిల్డింగ్ స్టోను మైను వెలికి తీయుటకు ప్రతిపాదించినారు. లీజు ఏరియా 7.90హెక్టార్లు (రోడ్డుమెటల్, బిల్డింగ్ స్టోను **-2,42,682 M3/annum**) చేసి వెలికి తీయుటకు పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ గురించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, తిరుపతి వారిచే ఈ ప్రకటన జారీ చేయబడినది. ప్రతిపాదిత కార్యకలాపాల యొక్క వివరములు ఈ క్రింద వివరించబడినది.

1. కంపెనీ పేరు,చిరునామా మరియు టెలిఫోన్ నెం.	శ్రీ పి. క్షీరసాగర రెడ్డి, రోడ్డుమెటల్ & బిల్డింగ్ స్టోను మైను (7.90హెక్టార్లు), సర్వే నెం. 260/5 పార్టు (పాత సర్వే నెం.12), కాకవేడు(V), నగరి(M), చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్, సెల్: 9866688008, 9866889624 ఈమెయిల్:sekhar6345@gmail.com
2. కార్యకలాపాల నిర్వహణకు ప్రతిపాదించబడిన ప్రదేశము మరియు విస్తీర్ణం	సర్వేనెం.260/5 పార్టు (పాత సర్వే నెం.12), కాకవేడు(V), నగరి(M), చిత్తూరు జిల్లా,ఆంధ్రప్రదేశ్. పరిధిలో మొత్తం విస్తీర్ణం 7.90 హెక్టార్లు.
3. సంప్రదించవలసిన సంబంధిత కంపెనీ అధికారి పేరు,చిరునామా మరియు ఫోన్‌నెంబరు	శ్రీ పి.క్షీరసాగర రెడ్డి, డోర్‌నెం.5-40-బి, రాజుసాహెబ్ పేట, చిన్నాయ్యరశాల, పోరుమామిళ్ల కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్ - సెల్: 9866688008, 9866889624 ఈమెయిల్:sekhar6345@gmail.com
4. ప్రతిపాదిత కార్యకలాపాలకు కేటాయించిన పెట్టుబడి	రూ.40.70 లక్షలు
5. ప్రతిపాదిత కార్యకలాపాల వివరములు	రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోను మైను లీజు ఏరియా 7.90 హెక్టార్లు(రోడ్డు మెటల్, బిల్డింగ్ స్టోను - 2,42,682 m3 /annum) చేసి వెలికి తీయుటకు
6. ప్రజాభిప్రాయ సేకరణ తేది, సమయం మరియు ప్రదేశం	తేది : **21.09.2023** సమయం : **మ.12.30 గం॥లకు** ప్రదేశం : సర్వేనెం.260/5 పార్టు, (పాత సర్వే నెం.12), కాకవేడు (V), నగరి (M), చిత్తూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిత మైను లీజు ఏరియా వద్ద

7. **ప్రతిపాదనకు సంబంధించిన వివరములు సదరు ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సమ్మరీ & REIA రిపోర్టులను ప్రజల సౌకర్యార్థం ఈ క్రింది కార్యాలయములలో లభ్యపరచబడినది.**
   a) జిల్లా కలెక్టరు & మేజిస్ట్రేట్ వారి కార్యాలయము, చిత్తూరు జిల్లా
   b) చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి వారి కార్యాలయము, జిల్లా పరిషత్, చిత్తూరు జిల్లా
   c) జనరల్ మేనేజర్ వారి కార్యాలయము, జిల్లా పరిశ్రమల కేంద్రం, చిత్తూరు జిల్లా
   d) రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయము, నగరి, చిత్తూరు జిల్లా
   e) యస్.కె.శ్రీవాస్తవ, డైరెక్టర్ ఇంపాక్ట్-1ఎ-II మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్, ఫారెస్ట్ & క్లైమేట్ చేంజ్(MoEF & CC), గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, ఇందిరా పర్యావరణ భవన్, జోర్బగ్ రోడ్డు, న్యూ ఢిల్లీ- 110003
   f) ది అడిషినల్ ప్రిన్సిపాల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్(సి),మినిస్ట్రి ఆఫ్ ఎన్విరాన్‌మెంటల్, ఫారెస్ట్ & క్లైమేట్ చేంజ్ వారి కార్యాలయము, కెథడ్రల్ గార్డెన్‌రోడ్డు, నుంగంబాక్కం, చెన్నై-600034
   g) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయము, బోర్డు ఆఫీస్, కస్తూరిబాయిపేట, విజయవాడ
   h) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయము, జోనల్ కార్యాలయము, కృష్ణా నగర్ రైల్వే గేట్ దగ్గర, కర్నూలు
   i) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయము, ప్రాంతీయ కార్యాలయము, ఎన్.టి.రోడ్డు, తిరుపతి
   j) తహశీల్దారు వారి కార్యాలయము, నగరి మండలము, చిత్తూరు జిల్లా
   k) గ్రామ పంచాయతీ కార్యాలయం, కాకవేడు (V), నగరి (M), చిత్తూరు జిల్లా

కేంద్ర పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ ప్రకటన జారీ ఎస్.ఓ.నెం.1533 తేది: 14.09.2006లో పేర్కొనబడిన (వరుస క్రమము 7III(a) (ఎ) మరియు (బి)లలో) రీతిలో ఈ ప్రతిపాదన కార్యకలాపాల వలన నష్టపోవు ప్రజల నుండి మరియు పర్యావరణ సంబంధిత అంశముల వల్ల ప్రభావితపు ప్రజల నుండి వ్యాఖ్యలు, అభ్యంతరములు ఏమైనా వున్నట్లయితే వాటిని లిఖిత పూర్వకంగా ఈ ప్రకటన వెలువడిన తేది నుండి 30 రోజులలోపు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి, తిరుపతి వారికి తెలుపవచ్చును. అటువంటివారు, పైన పేర్కొనబడిన తేదీన ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో కూడా పాల్గొని తమ అభిప్రాయములు స్వయముగా తెలుపవచ్చును.

సం/-
ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయము, తిరుపతి

ప్రదేశం : తిరుపతి
తేది : 20.08.2023

చీటీల పేరుతో రూ.3 కోట్లతో పరారీ

సుమారు రూ.3 కోట్లకు పైగా వసూలు చేసి గుట్టుచప్పుడుగా ఓ చీటీల నిర్వాహకుడు ఉడాయించిన ఘటన పెద్దపంజాణి మండలం శివాడి గ్రామంలో వెలుగులోకి వచ్చింది. సొంతింటిని సైతం రహస్యంగా విక్రయించి భార్య పిల్లలతో కలిసి అదృశ్యమయ్యాడు ఆ ఘనుడు. సుమారు ఆరు గ్రామాలకు చెందిన 70 మందికి పైగా బాధితులు ఉన్నట్లు సమాచారం. బాధితులంతా పేదలు కావడంతో పోలీసులను ఆశ్రయించారు.


మూతపడిన లోకేష్‌బాబు దుకాణం (ఇన్‌సెట్) లోకేష్‌బాబు(ఫైల్)

- లబోదిబోమంటున్న బాధితులు
- ఆరుగ్రామాలు..70 మందికి పైగా బాధితులు
- పోలీసులను ఆశ్రయించిన వైనం

పెద్దపంజాణి: అత్యాసకు పోయి మోసపోకూడదని పోలీసులు ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా పలువురు దగా పడుతూనే ఉన్నారు. పలు వ్యాపారాలు చేస్తూ నమ్మకంగా ఉంటూ చీటీల పేరుతో సుమారు రూ.కోట్లకు పైగా వసూలు చేసి శివాడికి చెందిన నెర్నిపల్లి చెంగ్రాయప్ప కుమారుడు ఎన్. లోకేష్ బాబు పరారీ కావడం మండలంలో తీవ్ర చర్చనీయాంశమైంది. లోకేష్ బాబు సమీప గ్రామమైన శంకర్రాయలపేటలో 15 ఏళ్ల కిందట టీ కొట్టు ప్రారంభించాడు. అంచెలంచెలుగా ఎదుగుతూ జనరల్ స్టోర్, సిమెంటు ఏజెన్సీ, షామీయానా సప్లయర్స్‌తోపాటు చీటీల నిర్వహణ, ఫైనాన్స్ కార్యకలాపాలు నిర్వహించేవాడు. నమ్మకంతో సమీప ప్రాంతాలైన మాడి, శివాడి, గుట్టూరు, అప్పినపల్లె, గుండుగల్లు, మార్వేపల్లెకు చెందిన సుపరిచితులు ఇతని వద్ద నెల కంతుల వారీగా రూ.లక్ష నుంచి రూ.7 లక్షల వరకు చీటీల పేరుతో డబ్బులు కట్టేవారు. వీటితోపాటు చీటీల కంతులు పూర్తయిన వారినుంచి ఇతనే డబ్బులు వడ్డీకి తీసుకొని వాటిని సొంతానికి వినియోగించుకొనేవాడు. ఇదంతా జరుగుతూ నమ్మకం పెరిగే కొద్దీ వ్యాపారం... చీటీల లావా దేవీలు ఊపందుకోగా దుకాణాలన్నీ మూత వేసి అందినంతా దండుకుని ఉడాయించాడు. ఇతను ఇంటికి తాళాలు వేసి ఉండడం, షాపులు మూత పడి ఉండడంతో బాధితులు వివరాలపై ఆరా తీయగా, ఇంటిని రహస్యంగా వేరొకరికి విక్రయించి సుమారు రూ.3 కోట్లకు పైగా నగదుతో పరారయ్యాడని, మోసపోయామని గుర్తించారు. బాధితులందరూ ఏకమై పెద్దపంజాణి పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

రూ.7 లక్షలు రావాలి



నమ్మకంతో నెలనెలా చీటీ కంతులు నిర్ణయించిన 5వ తేదీకే చెల్లించాను. రూ.5 లక్షలు చీటి నెలకు రూ.12,500 చొప్పున చెల్లించాను. చీటీ పూర్తి అయినా నగదు చెల్లించలేదు. డబ్బులు అవసరం అంటే నేనే రూ.2 లక్షలు అప్పుగా ఇచ్చాను. మొత్తం రూ.7 లక్షలు రావాల్సి ఉంది. ఇలా లోకేష్ బాబు మోసం చేస్తాడని అనుకోలేదు.

– వెంకటపతి, శంకర్రాయలపేట

రూ.96 వేలు చెల్లించాను



కష్టపడి సంపాదించిన సొమ్ములో కొంత మేరకు నెలా నెలా మిగుల్చుకుంటూ లోకేష్‌బాబు వద్ద చీటీ వేశాను. రూ.2.10 లక్షల చీటికి ప్రస్తుతం రూ:96 వేలు చెల్లించాను. నా బిడ్డల చదువులకోసం పొదుపు చేస్తూ వస్తే ఇలా మోసపోయానని తెలుసుకొన్నాను. పోలీసులు చొరవ తీసుకుని న్యాయం చేయాలి.

– రవి, శివాడి

జాతీయ రహదారిపై కారు దగ్ధం

శ్రీరంగరాజపురం : మండలంలోని చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై లక్ష్మీపురం వద్ద శనివారం ఓ కారు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు నెలవాయి ఎస్ఎస్‌జే షుగర్స్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కపిలన్ తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టు నుంచి కారులో ఫ్యాక్టరీకి వస్తున్నారు. శ్రీరంగరాజపురం మండలం లక్ష్మీపురం వద్ద నయారా పెట్రోల్ బంక్ సమీపంలో కారు నుంచి అకస్మాత్తుగా పొగలు వచ్చాయి. అప్రమత్తమైన డ్రైవర్ కారును ఆపేశాడు. డ్రైవర్, కపిలన్ కిందకు దిగేటప్పటికి కారులో మంటలు రేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలం వద్దకు చేరుకునే లోపే కారు పూర్తిగా దగ్ధమైంది. ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఉంటాయని భావిస్తున్నారు.

483 విద్యుత్ చౌర్యం కేసుల నమోదు

చిత్తూరు కార్పొరేషన్: ఉమ్మడి జిల్లాలో శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ట్రాన్స్‌కో 8 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. మొత్తం 3,031 సర్వీసులు తనిఖీ చేశారు. ఇందులో తిరుపతి ఆపరేషన్ పరిధిలో 104, తిరుపతి రూరల్ 66, పుత్తూరు 71, చిత్తూరు అర్బన్ 52, చిత్తూరు రూరల్ 37, మదనపల్లె 82, పీలేరు 22, పుంగనూరు పరిధిలో 49 విద్యుత్ చౌర్యం, అపరాధరుసుం పరంగా కేసులు నమోదు చేశారు. మొత్తం 483 సర్వీసులపై కేసులు నమోదు చేసి రూ.12.03 లక్షలు అపరాధ రుసుం, జరిమానా రూపంలో చెల్లించాలని నోటీసులు ఇచ్చినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి వివరించారు.

అభ్యసనా సామర్థ్యాలు పెంచాలి

బంగారుపాళెం: చదువులో వెనుకబడిన విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలను పెంపొందించేందుకు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయేంద్రరావు తెలిపారు. శనివారం బంగారుపాళెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో 7వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచాలని హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. ఫార్మెట్–1 ఫలితాల్లో విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. పాఠశాలకు రాని విద్యార్థులను గుర్తించి రెగ్యులర్‌గా వచ్చే విధంగా చూడాలన్నారు. పదో తరగతి విద్యార్థులకు ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులను నిర్వహించాలని తెలిపారు. వంద శాతం ఫలితాలను సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారుచేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. డిజిటల్ విద్యా బోధన ప్రొత్సహించాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడి వద్ద లెసన్ ప్లాన్, టీచర్ డైరీ, డీఎల్ఎం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. అనంతరం స్థానిక రాయల్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. 5వ తరగతి విద్యార్థుల సామర్థ్యాలపై ఆరా తీశారు. వ్యాన్‌లో పిల్లలను తీసుకురావడం, తీసుకుపోవడం వంటి విషయాలపై తగిన జాగ్రత్తలు పాటించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. ఎంఈఓ–వన్ నాగేశ్వర్‌రావు, ఎంఈఓ–టు రమేష్‌బాబు పాల్గొన్నారు.

హతుడు గండుగల్లు వాసి

- మృతదేహం తల్లిదండ్రులకు అప్పగింత
- గంట పరిచయంలోనే హత్య


హత్యకు గురైన హరిప్రసాద్(ఫైల్)

పలమనేరు: పలమనేరు పట్టణ సమీపంలోని హైవేలో కోర్టుకు ఎదురుగా గురువారం రాత్రి హత్యకు గురైన వ్యక్తి గంగవరం మండలం గుండుగల్లుకు చెందిన మొగిలప్ప కుమారుడు హరిప్రసాద్(32)గా పోలీసులు శనివారం గుర్తించారు. స్థానిక ఆస్పత్రి మార్చురీలో ఉన్న మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు. ఇందుకు సంబంధించి పట్టణ సీఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మూడు రోజుల కిందట హత్య జరగగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. హతుని ముఖం గుర్తుపట్టని విధంగా బండరాయితో మోది ఉండడంతో ఎవరైంది గుర్తించలేక పోయారు. నిందితుడు స్థానిక సిల్క్‌ఫాంకు చెందిన మురళి(16)గా నిర్ధారించారు. హతుని వివరాలు మాత్రం తెలియరాలేదు. శుక్రవారం పట్టణంలోని పలు వీధుల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించగా స్థానిక రాధాబంగ్లా వీధిలోని మద్యం దుకాణం వద్ద నిందితుడు, హత్యకు గురైన వ్యక్తి కలసి వెళుతున్న దృశ్యాలను గుర్తించారు. దీనిపై శనివారం 'సాక్షి'లో 'ఇంతకూ హతుడెవరు' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. హతుడు కర్ణాటక బోర్డర్ సమీప గ్రామాలకు చెందిన వాడై ఉంటాడని, తాపీ పనులు చేసుకునే అవకాశం ఉందని అనుమానాలు వ్యక్తం కావడంతో ఆకోణంలో పోలీసులు విచారించారు. అందులో భాగంగా శనివారం ఉదయం పట్టణంలోని తాపీపని చేసే వారికి సీసీ ఫుటేజీ దృశ్యాలను చూపించగా, వారు హతుడిని గుర్తించారు. ఆపై అతని తండ్రి మొగిలప్పను పిలిపించిగా మృతదేహాన్ని చూపించగా తమ కుమారుడిదేనని నిర్ధారించారు. ఇతను తాపీ పనులు చేస్తూ ఇంటికి వారానికోసారి వెళ్లేవాడు. దీంతో ఎక్కడైనా పనులకు వెళ్లి ఉంటాడని కుటుంబ సభ్యులు పట్టించుకోలేదు. హత్య జరిగిన రోజు అంబేడ్కర్‌సర్కిల్‌లో వెళుతుండగా నిందితుడు తనవద్ద సెల్‌ఫోన్ ఉందని అమ్ముతానని చెప్పడంతో వీరిద్దరిమధ్య పరిచయం జరిగింది. ఇరువురూ ఓ సెల్ దుకాణంలో దాన్ని రూ.700 విక్రయించి, ఆ డబ్బుతో మద్యం సేవించారు. మత్తులో మాటమాట పెరిగి హత్యకు కారణమైంది. గంట పరిచయంలోనే ఈ ఘాతుకం జరిగింది.